భారతరత్న పీవీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు

పీవీకి నివాళి

జీడిమెట్ల, ఫిబ్రవరి 9: భారత మాజీ ప్రధాన మంత్రి స్వర్గీయ పీవీ నర్సింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారత రత్న ప్రకటించడం పట్ల శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం సూరారం కాలనీలోని కార్యాలయంలో పీవీ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం ముఖ్య సలహాదారులు సర్వేపల్లి రమేశ్ కుమార్‌తో పాటు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న నిజాంపేట్ మేయర్

ఆలయ ప్రాంగణంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి దంపతులు

దుండిగల్, ఫిబ్రవరి 9: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి దంపతులు శుక్రవారం తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. కాగా శుక్రవారం నిజాంపేట్ మేయర్ నీలారెడ్డి జన్మదినం కావడంతో కార్పొరేషన్ పరిధిలోని పార్టీ శ్రేణులు పలు సేవాకార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిజాంపేట్‌లోని అంగన్‌వాడీ పాఠశాలలో డిప్యూటీ మేయర్ ధన్‌రాజుయాదవ్ చిన్నారులతో కలిసి కేక్‌కట్ చేశారు. అనంతరం చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సురేశ్‌రెడ్డి, నేతలు ఆవుల జగన్‌యాదవ్, వెంగయ్యచౌదరి, చందుముదిరాజు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా మయూరీనగర్‌లోని ఆశ్రీ అనాథాశ్రమంలోని చిన్నారులకు ఎన్ఎంసీ బీఆర్ఎస్ పార్టీ యూత్ వైస్‌ప్రెసిడెంట్ రాము తదితరులు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్, రమేశ్, యుగంధర్, యాదగిరి, మహేశ్, సురేశ్, శ్రావణ్, కార్తీక్, శివ, నాని తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కట్టమైసమ్మ జాతర

విద్యుత్ దీపాల వెలుగుల్లో కాంతులీనుతున్న అమ్మవార్ల ఆలయం

ఏర్పాట్లను పరిశీలించిన బాలానగర్, మేడ్చల్ డివిజన్‌ల ట్రాఫిక్ ఏసీపీలు

దుండిగల్, ఫిబ్రవరి 9: సూరారం డివిజన్ పరిధిలోని సూరారం కట్టమైసమ్మ, రేణుకాఎల్లమ్మ తల్లి జాతర శనివారం నుంచి ప్రారంభం కానుంది. శనివారం నుంచి బుధవారం వరకు ఐదు రోజుల పాటు జాతర జరుగనున్నది. ఇందులో భాగంగా శనివారం ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, పంచామృత అభిషేకం వంటి పూజలతో జాతర ప్రారంభం కానుంది. 8 గంటలకు పుణ్యాహవచం, గణపతిపూజ, అంకురార్పణ, దీక్షాధారణ, అగ్నిప్రతిష్ఠ, నవవర్ణజపహోమం, మధ్యాహ్నం 12 గంటలకు కల్యాణం, తలంబ్రాలు, ఒడి బియ్యం సమర్పణ ఉంటుంది. అలాగే సాయంత్రం 5 గంటలకు సూరారం గ్రామంలోని రామాలయం నుంచి అమ్మవార్ల ఉత్సవమూర్తుల ఊరేగింపు వైభవంగా నిర్వహించనున్నారు. ఇక ప్రధాన జాతర జరిగే ఆదివారం 11న ఉదయం 5 గంటలకు అమ్మవార్ల అలంకరణలు, శ్రీచక్రార్చన, కుంకుమార్చనలు, ఒడిబియ్యం సమర్పణ, మంగళహారతి, బోనాల సమర్పణ, మొక్కుబడులు వంటివి నిర్వహిస్తారు. 12వ తేదీన సోమవారం రంగం, భవిష్యవాణి, భూతబలి, వేదమంత్రాలతో ఆశీర్వచనం ఉంటుంది. సాయంత్రం 5 గంటలకు సూరారం గ్రామం నుంచి పోతరాజుల విన్యాసాలతో ఫలహార బండి ఊరేగింపు జరుగుతుంది. జాతర చివరి రోజు బుధవారం 14న మధ్యాహ్నం 12 గంటలకు ఆలయకమిటీ ఆధ్వర్యంలో మహాన్నదానం నిర్వహించనున్నారు. వేడుకల నిర్వహణ కోసం దేవస్థానం కమిటీ సభ్యులు ఇప్పటికే ఏర్పాట్లను పూర్తి చేసింది. సూరారం గ్రామప్రజల ఇలవేల్పుగా, కోరిన కోర్కెలు తీర్చే అమ్మవార్లుగా ప్రసిద్ధిగాంచిన ఈ జాతరలో నగరశివారు ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు హాజరుకానున్నట్లు ఆలయకమిటీ పేర్కొంది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా తాగునీరు, వైద్యసదుపాయం, విద్యుత్‌లైట్ల ఏర్పాటు వంటి వసతులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఏర్పాట్లు పరిశీలించిన ట్రాఫిక్ ఏసీపీలు...

కట్టమైసమ్మ, రేణుకా ఎల్లమ్మతల్లి జాతర నేపథ్యంలో శుక్రవారం బాలానగర్, మేడ్చల్ జోన్ ట్రాఫిక్ ఏసీపీలు శ్రీనివాసులు, వెంకట్ రెడ్డి అమ్మవార్ల ఆలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రధాన జాతర జరిగే ఆదివారం రోజున భక్తులు పోటెత్తనుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆలయకమిటీ సభ్యులతో చర్చించారు. అంతకు ముందు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కట్టమైసమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న బాలానగర్, మేడ్చల్ జోన్‌ల ఏసీపీలు శ్రీనివాసులు, వెంకట్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు

సెయింట్ మార్టిన్ విద్యార్థుల ప్రతిభ

ప్రతిభను చాటిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.సంతోష్‌పాత్ర

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 9: నగరంలో వర్తుసా జటాయు సీజన్-3 ఐడియాథాన్‌లో దూలపల్లి సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు తమ అత్యుత్తమ ప్రతిభను చాటారు. దేశ నలుమూలల నుంచి హాజరైన విద్యార్థుల్లో సెయింట్‌మార్టిన్ విద్యార్థులు ఏంజెల్ మేరీపౌలినా, చిప్పల చిన్మయి, మీరి పెల్లి సంజన, పల్లెమీడి విహారి వైద్య రంగంలో నూతనంగా హెల్త్‌కేర్ ఎ1 చాట్‌బాట్ అనే వినూత్న ప్రాజెక్ట్‌ను రూపొందించారు. దీని ద్వారా దేశవ్యాప్తంగా ఔత్సాహిక సాంకేతిక నిపుణులకు స్ఫూర్తిదాయకంగా నిలవడంతో రూ.6.5 లక్షల ఎల్‌పీఏ రివార్డుతో పాటు ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.సంతోష్‌కు మార్‌పాత్ర విద్యార్థులను అభినందించారు.

క్రీడలతో శారీరక, మానసికోల్లాసం

కేపీహెచ్‌బీ కాలనీ రమ్యాగ్రౌండ్‌లో క్రీడా విజేతలకు బహుమతుల ప్రదానోత్సవంలో ప్రిన్సిపాల్ శ్రీధర్‌రావు

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 9 : క్రీడలతో శారీరక, మానసికోల్లాసం కలుగుతుందని విద్యార్థులు క్రీడా నైపుణ్యాలను పెంపొందించుకని ఉన్నతంగా ఎదగాలని ప్రగతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌రావు అన్నారు. శుక్రవారం కేపీహెచ్‌బీ కాలనీ రమ్యాగ్రౌండ్‌లో విద్యార్థులకు నిర్వహించిన క్రికెట్, ఖోఖో, వాలీబాల్, టగ్ ఆఫ్ వార్, షాట్‌పుట్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరిగేందుకు క్రీడలు దోహదపడతాయన్నారు. నిత్యజీవితంతో క్రీడలు, వ్యాయామానికి సమయాన్ని కేటాయించాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులున్నారు.

నేడు గచ్చిబౌలిలో ఖీర్ స్వాభిమాన్ యాత్ర

సమావేశంలో మాట్లాడుతున్న మోనాలిసా

ఖైరతాబాద్, ఫిబ్రవరి 9: ట్రాన్స్‌జెండర్స్‌కు సామాజిక, రాజకీయ న్యాయం కావాలని, వారిపై హింస, వివక్షను రూపుమాపాలంటూ నేడు గచ్చిబౌలిలో ఖీర్ స్వాభిమాన్ యాత్ర నిర్వహిస్తున్నామని నిర్వహణ కమిటీ ప్రతినిధి మోనాలీసా తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ట్రాన్స్‌జెండర్స్‌కు సరైన రిజర్వేషన్లు లేవని, సంక్షేమ ఫలాలు అందవని, సమాజంలో తీవ్ర వివక్షణను ఎదుర్కొంటున్నారన్నారు. వారి హక్కులను కాపాడాల్సిన బాధ్యత పాలక ప్రభుత్వాలపై ఉంటుందన్నారు. నేడు ప్రైడ్ వాక్ పేరుతో స్వాభిమాన్ యాత్ర నిర్వహిస్తున్నామని, రేపు గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తమ కమ్యూనిటీ ఆధ్వర్యంలో ప్రైడ్ కార్నివాల్ ను నిర్వహిస్తున్నామని, ట్రాన్స్‌జెండర్స్ రూపొందించిన చేతి వృత్తులు, కళారూపాలను ప్రదర్శిస్తామని, క్రీడలు, సాంస్కృతి వేడుకలు ఉంటాయన్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా సినీ నటి, అన్నపూర్ణ కాలేజ్ ఆఫ్ ఫిల్మ్ అండ్ మీడియా డైరెక్టర్ అక్కినేని అమల హాజరవుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో వాసవి, జయంత్, విష్ణు తేజా, నిషా, డాలీ, లిల్లీ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

కూకట్‌పల్లి జోన్ ఆఫీస్‌లో సమీక్షాసమావేశంలో జడ్సీ అభిలాష, కార్పొరేటర్లు, అధికారులు

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 9 : ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అన్నారు. శుక్రవారం కూకట్‌పల్లి జోన్ ఆఫీస్‌లో మూసాపేట, కూకట్‌పల్లి సర్కిళ్లకు చెందిన కార్పొరేటర్లు, ఇంజినీరింగ్, పారిశుధ్య, యూబీడీ విభాగాల అధికారులతో సమీక్షాసమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు ఆయా డివిజన్ల పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పటికే చేపట్టిన సీసీరోడ్లు, పైపులైన్లు, పార్కుల పనులను పూర్తి చేసేందుకు చొరవ చూపాలని కోరారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని నాలాల్లో పూడిక తీయాలని కోరారు. ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలని జడ్సీ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మందడి శ్రీనివాస్‌రావు, పగుడాల శిరీషాబాబూరావు, సబీహాబేగం, పండాల సతీశ్‌గౌడ్, ముద్దం నర్సింహ యాదవ్, ఆవుల రవీందర్‌రెడ్డి, జూపల్లి సత్యనారాయణ, రోజాదేవి, వెంకటేశ్‌గౌడ్, నార్నె శ్రీనివాస్‌రావు, ఎస్ఈ చిన్నారెడ్డి, ఈఈలు గోవర్ధన్, సత్యనారాయణ, డీఈలు, ఏఈలు, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

భావితరాల శాస్త్రవేత్తలు నేటి విద్యార్థులే

క్యూఎంఆర్ఎస్ఎంఏ చైర్మన్ పి.శివయ్య

వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న పి.శివయ్య, ఉపాధ్యాయులు తదితరులు

జీడిమెట్ల, ఫిబ్రవరి 9: భావితరాల శాస్త్రవేత్తలు నేటి విద్యార్థులేనని క్యూఎంఆర్ఎస్ఎంఏ చైర్మన్ పి.శివయ్య అన్నారు. చింతల్ డివిజన్ పరిధి పట్వారీ నగర్‌లోని నవజ్యోతి పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పి.శివయ్య హాజరై విద్యార్థులు రూపొందించిన నమూనాలను తిలకించారు. అనంతరం 125 వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులకు, విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కరస్పాండెంట్ ఎం.ఇందిరా రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్లు ఆదిత్య కృష్ణ, రూపాంజలి, ఎ.ఆర్.సీ బాబు, కృష్ణారెడ్డి, మాధవ రెడ్డి, వర ప్రసాద్, చింతల మహేశ్ కుమార్ యాదవ్, జే.దయాకర్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

బీఆర్ఎస్ నేతలతో సమావేశమైన కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ

దుండిగల్, ఫిబ్రవరి 9: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నామని దుండిగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ నేతలు, పలు సంఘాల సభ్యులు శంభీపూర్‌లోని కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

మహిళలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న తూము శ్రావణ్‌కుమార్

మూసాపేట, ఫిబ్రవరి9: మహిళలు అన్ని రంగాల్లో ఆర్థికాభివృద్ధి సాధించాలని మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ అన్నారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సాహకారంతో డివిజన్ పరిధిలోని జనతానగర్‌లో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ పొందిన మహిళలకు శుక్రవారం తన కార్యలయంలో సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ.. మహిళల ఆర్థిక స్వాలంబన కోసం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఖార్డ్ స్వచ్ఛంద సంస్థ వారితో ఉచిత శిక్షణ ఇప్పించి, శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు తన సొంత నిధులతో కుట్టు మిషన్లను అందించాలరని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, జిల్లా గోపాల్, తుకారం, రవిసింగ్, మనోజ్, అక్బర్, దస్తగిరి, అరుణ్, హరిత, రమాదేవి, శాంత, సంధ్య, శివాణి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన

కేపీహెచ్‌బీ కాలనీ రెమెడీ వైద్యశాలలో ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్ బీవీ శోభ

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 9 : కేపీహెచ్‌బీ కాలనీ 4వ రోడ్డులోని రెమెడీ వైద్యశాలలో నిర్వహించిన ఉచిత గైనకాలజీ వైద్య శిబిరానికి మంచి స్పందన లభించిందని డాక్టర్ బీవీ శోభ తెలిపారు. శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరంలో మహిళలకు క్రమరహిత రుతుక్రమం, రక్తస్రావం, రుతస్రవం ముందు తర్వాత వచ్చే సమస్యలు, గర్భంలో సమస్యలు, దిగువ కడుపునొప్పి, వీపునొప్పి, తెల్లబట్ట అగుట లాంటి సమస్యలపై మహిళలకు పరీక్షలు చేయడంతో పాటు సలహాలు సూచనలు అందించినట్లు తెలిపారు. వైద్య శిబిరంలో సుమారు వందమంది పాల్గొన్నట్లు తెలిపారు.

రేపు గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య శిబిరం..

కేపీహెచ్‌బీ కాలనీలోని రెమెడీ వైద్యశాలలో రేపు (ఆదివారం) గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వైద్యశాల నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. వైద్యశాల ప్రాంగణంలో ఉయదం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు డాక్టర్ డి.రాహుల్ పర్యవేక్షణలో ఉచిత పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వైద్య శిబిరంలో పాల్గొన్న వారికి శస్త్ర చికిత్సలో రాయితీ ఉంటుందని.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు.. 9912222042 నంబన్‌ను సంప్రదించాలన్నారు.

మాదాపూర్‌లోని శిల్పారామంలో కొనసాగుతున్న నేషనల్ హ్యాండ్లూమ్ ఎక్స్‌పో - గాంధీ బుణాకర్ మేళాలో భాగంగా పలువురు కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల్లో భాగంగా ఒడిస్సీ నృత్యాలు, పాటలు, జానపద కళలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి జేజేఎల్ డైరెక్టర్ సందీప్ పట్నాయక్, మాజీ డీజీపీ టీపీ దాస్, తెలంగాణ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సునీల్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై కళాకారులను అభినందించారు. *-కొండాపూర్, ఫిబ్రవరి 9*

శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహం ఏర్పాటు సంతోషకరం

భానుప్రకాశ్ నాయక్

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 9 : హైదరాబాద్‌లో బంజారాల ఆరాధ్యదైవం శ్రీసంత్ సేలావాల్ మహారాజ్ విగ్రహ ఏర్పాటు చేస్తానని ప్రభుత్వం ప్రకటించడం సంతోషకరమని బంజారా రాష్ట్ర విద్యార్థి సంఘం అధ్యక్షుడు ఎల్.భానుప్రకాశ్ నాయక్ అన్నాడు. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి శ్రీసంత్ సేలావాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ఫిబ్రవరి 15న ఐచ్చిక సెలవుగా ప్రకటించడంతో పాటు మహానగరంలో మహారాజ్ విగ్రహాన్ని ప్రతిష్ఠాపన చేస్తానని ప్రకటించడం యావత్ బంజారా జాతి హర్షిస్తుందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డికి, దీనికి సహకరించిన రోడ్లు భవనాల శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

అట్టహాసంగా హామ్స్‌టెక్ ఫ్యాషన్ షో

మాదాపూర్, ఫిబ్రవరి 9: హామ్స్‌టెక్ విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి ర్యాంప్‌పై క్యాట్ వాక్ చేసి సందర్శకులను విశేషంగా అలరించారు. మాదాపూర్‌లోని ఎన్ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన హామ్స్‌టెక్ ఫ్యాషన్ షో-2024 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సెలబ్రిటీ, నేషనల్ అవార్డ్ విన్నంగ్ ఫ్యాషన్ డిజైనర్ నీతా లుల్లా విచ్చేసి డిజైనర్‌లు కామిని షరీఫ్, గౌరాన్సా, హామ్స్‌టెక్ సీఈఓ అజితారెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు తమ నైపుణ్యతతో మూడేండ్లుగా నేర్చుకున్న ఫ్యాషన్ ఉత్పత్తులను స్టాల్స్‌లో ప్రదర్శించినట్లు చెప్పారు. సస్టైనబిలిటీ డిజైన్ అనే థీమ్‌తో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 200లకు పైగా డిజైనర్‌లు వేయికి పైగా డిజైన్‌లను స్టాల్స్‌లో ప్రదర్శించారు. ఇందులో విద్యార్థులు స్వయంగా తయారు చేసిన దుస్తులతో పాటు లైటింగ్ ల్యాంప్, గృహోపకరణ ఉత్పత్తులను ప్రదర్శించడంతో విద్యార్థులు సెల్ఫీలు దిగుతు సందడి చేశారు. అనంతరం విద్యార్థులు ఆట, పాటలతో చిందులు వేస్తు సందడి చేస్తూ ఉత్సాహంగా గడిపారు.

భవన నిర్మాణ కార్మికులకు అండగా ఉంటా

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 9 : భవన నిర్మాణ కార్మికులకు ఎల్లప్పుడు అండగా ఉంటానని కాంగ్రెస్ పార్టీ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం కూకట్‌పల్లి డివిజన్ ప్రగతినగర్‌లో జరిగిన అస్బెస్టాస్ కాలనీ శ్రీభవానీ శ్రమశక్తి భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరై కార్మికులకు ఐడెంటిటీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం నుంచి సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సంఘం నేతలు వీరనాగప్ప, బాలాజీ, మోహన్‌రావు, నర్సింహ, కాశీం, శ్రీను, ఆగంరెడ్డి, ఆరోగ్యం, రవి, చందయ్య, తిరుపతిరావు, హరిబాబు, కృష్ణారావు, ఆంజనేయులు, రాంబాబు, తదితరులున్నారు.

గ్యాస్ పథకంపై ఇంటింటి పరిశీలన

మియాపూర్, ఫిబ్రవరి 9: ప్రజాపాలన దరఖాస్తులపై చందానగర్ సర్కిల్ పరిధిలో శుక్రవారం విచారణ ప్రారంభమైంది. సర్కిల్ పరిధిలో సుమారు 5 వేల వరకు రూ.500 గ్యాస్ పథకం కోసం దరఖాస్తులు అందాయి. దరఖాస్తుదారుల ఇంటి వద్దకే వెళ్లి గ్యాస్ ఐడీ నంబర్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, గ్యాస్ కనెక్షన్‌కు అనుసంధానించిన ఫోన్ నంబర్ వంటి వివరాలను పరిశీలిస్తున్నారు. సర్కిల్ పరిధిలోని నాలుగు వార్డులలో క్షేత్రస్థాయి విచారణను చేపడుతున్నట్లు డీసీ వంశీకృష్ణ తెలిపారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థినులకు ఉచితంగా ద్విచక్రవాహన శిక్షణ

డిగ్రీ కళాశాలలో ఉచిత ద్విచక్రవాహన శిక్షణపై అవగాహన ఒప్పందంలో ప్రిన్సిపాల్ అలివేలు మంగమ్మ, సంస్థ ప్రతినిధులు

కేపీహెచ్‌బీ కాలనీ, ఫిబ్రవరి 9 : కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థినులకు స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఉచితంగా ద్విచక్రవాహ శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ప్రిన్సిపాల్ అలివేలు మంగమ్మ తెలిపారు. శుక్రవారం డిగ్రీ కళాశాలలో ఎంవోడబ్ల్యూవో సంస్థతో ఎంవోయూ కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ద్విచక్రవాహనాన్ని నడపటం మహిళా సాధికారతకు ఒక చిహ్నమని ప్రస్తుత కాలంలో కనీస అవసరమన్నారు. విద్యార్థినులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ భవానీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వాణి, అధ్యాపకులు శోభ, కరుణ, సంస్థ ప్రతినిధులు జయభారతి, శుద్ర, అధ్యాపకులు, విద్యార్థులున్నారు.

ఉత్సాహంగా గ్రాండ్ గాలా కార్నివాల్

గ్రాండ్ గాల కార్నివాల్‌లో ఉత్సాహంగా గడిపిన యువత

మాదాపూర్, ఫిబ్రవరి 9: మాదాపూర్‌లోని ఎన్ కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం రాత్రి గ్రాండ్ గాలా కార్నివాల్ అట్టహాసంగా జరిగింది. ఇందులో యువత కుటుంబ సమేతంగా విచ్చేసి సందడి చేస్తూ ఉత్సాహంగా డ్యాన్సులు చేశారు. ఇందులో కేయివి, ఎలిజియం బ్యాండ్ మ్యూజిక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నాన్‌స్టాప్ పాటలతో చిన్న, పెద్ద అనే తేడాలు లేకుండా డ్యాన్సులు వేశారు. వింటేజ్ సాంగ్స్‌తో మొదలుపెట్టి రొమాంటిక్ సాంగ్స్‌తో కలిపి పాప్ సాంగ్స్‌తో ఉర్రూతలూగించారు. ఇందులో భాగంగా జ్యూవెలరీ స్టాల్స్, పిల్లలు ఆహ్లాదకరంగా గడపడానికి కెడ్స్ ప్లే ఏరియా, కిడ్స్ వర్క్ షాపును ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ సెలబ్రిటీలు, ప్రముఖులు హాజరవడంతో మరింత ఉత్సాహంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో లైవ్ బ్యాండ్, డీజేతో పాటు అనేక ఎంటర్‌టైన్‌మెంట్ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమం విజయవంతం కావడంతో త్వరలోనే మరో గ్రాండ్ గాల కార్నివాల్‌ను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.